# ఉపయోగం

రాజారావు పార్కుకొచ్చి కూర్చున్నాడు. ఆయన మనసు డల్‌గా ఉంది. చాలాకాలం నుంచి అలాగే ఉంటోంది. ఇద్దరు కొడుకులు రెక్కలొచ్చి దూరతీరాలకు వెళ్ళి తమ కుటుంబాలతో స్థిరపడిపోయారు. ఎప్పుడో ఓసారి



ఫోన్లో నాలుగు పొడిమాటలు మాట్లాడడం తప్ప, ఆప్యాయతలు, అనుబంధాలు లేవు. పదేళ్ళ క్రితం భార్య తనువు చాలించి తనని ఒంటరితనానికి అప్పగించి వెళ్ళింది.

రోజులు నిరాసక్తంగా వెళ్ళదీస్తున్నాడు. ఇంట్లో ఒక్కడూ వుంటే పిచ్చెక్కుతుందని పార్క్‌కొచ్చాడు. బెంచి మీద కూర్చుని చూస్తున్న తనకి శ్యామల కనిపించింది. తనతోపాటు డిగ్రీ చదివింది. మంచి మాటకారి. అందుకే గుర్తుపట్టి దగ్గరికెళ్ళాడు.

పలకరింపులు పూర్తయ్యాక 'తన కొక్కతే కూతురని, వచ్చేనెలలో పెళ్ళి ఉందని, తన భర్త ఆరునెలలుగా పక్షవాతంతో మంచాన పడి ఉన్నాడని.. అందుకని పెళ్ళిపనుల్లో కాస్త చేదోడువాదోడుగా ఉంటే రుణపడతా'నని చెప్పింది.

రాజారావుకి సంతోషం కలిగింది. తనవల్ల శ్యామలకి ఉపయోగం ఉంది. ఇంతకాలం తను ముసలివాడినైపోయాన ని.. ఎందుకూ పనికిరానని.. ఎవ్వరికీ అక్కర్లేనివాడినని అనుకున్నాడు. కానీ తను ఎంతోమందికి ఉపకారం చేయగలడు. శ్యామలకే కాదు.. తనతో చదువుకున్నవాళ్ళకి.. పరిచయస్తులకి ఏ రకమైన సహాయ సహకారాలు కావాలన్నా అందించగలడు. తప్పకుండా సహాయం చేస్తానని మాటిచ్చి ఆవిడ ఇంటి చిరునామా తీసుకుని ఉత్సాహం ఉరకలేస్తుండగా ఇంటిముఖం పట్టాడు రాజారావు.

– ప్రతాప వెంకట సుబ్బరాయుడు,
సికింద్రాబాద్